సాక్షి నిజామాబాద్

గురువారం, 7, ఆగస్టు, 2025



అంతర పంటలు..

జిల్లా రైతులు ప్రధాన పంటలతోపాటు అంతర పంటలు సాగుచేస్తూ అదనపు ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

- 8లో ▸



వేల్పూర్‌లో కలెక్టర్ తనిఖీలు

వేల్పూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.9 /24.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జయశంకర్ ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకొని నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద జయశంకర్ విగ్రహానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు సుదాం లక్ష్మి, బుస్స ఆంజనేయులు, బుస్సాపూర్ శంకర్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్, ఎం.రాజేశ్వర్, హన్మాండ్లు, చారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

- ఉత్తర్వులు జారీ చేసిన కార్యదర్శి డాక్టర్ శ్రీదేవి



బోధన్ టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ పరిపాలన విభాగం ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆలస్యంగా బయటకు వచ్చిన ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. జాదవ్ కృష్ణ గతంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ ఆఫీసర్(ఆర్వో)గా పనిచేశారు. ఆ సమయంలో విధుల్లో నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు జాదవ్ కృష్ణపై సస్పెన్షన్ వేటు వేశారు.

పదోన్నతులు వాయిదా

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడింది. పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితాలో తప్పులను సవరించాలంటూ హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఈ నెల 11 వరకు పదోన్నతుల ప్రక్రియ నిలుపుదల చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియను ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదిలా ఉండగా బుధవారం కొందరు ఉపాధ్యాయులు నాట్ విల్లింగ్ కోసం డీఈవో కార్యాలయానికి వచ్చారు. దీంతో తప్పనిసరిగా పదోన్నతులు తీసుకోవాల్సిందేనని అధికారులు స్పష్టంచేశారు. అంతలోనే పదోన్నతుల ప్రక్రియ వాయిదా పడినట్లు తెలియడంతో టీచర్లు వెనక్కి మళ్లారు.



శ్రీరాంసాగర్ జలాశయం

ఎస్సారెస్పీ నీటి విడుదలకు సిద్ధం

నేటి నుంచి కాకతీయ కాలువ ద్వారా జోన్-1కు..

- లక్ష్మి, సరస్వతి కాలువల ఆయకట్టుకు నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో గురువారం నుంచి కాలువల ద్వారా నీరు విడుదల కానుంది. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 40.5 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో కాకతీయ కాలువ ద్వారా జోన్-1 (ఎల్ఎండీ ఎగువ భాగాన డీ-54 వరకు) ఆయకట్టు, లక్ష్మి, సరస్వతి కాలువల ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ సగం మాత్రమే నిండగా, మరో మూడు నెలలపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చే అవకాశం ఉండటంతో నీటి విడుదల కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నీటి విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా 2.2 లక్షలు, లక్ష్మి కాలువ ద్వారా 50 వేలు, సరస్వతి కాలువ ద్వారా 35 వేల ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి తెలిపారు.

విద్యుదుత్పత్తికి రెడీ..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రం విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభిస్తే నాలుగు టర్బైయిన్ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి 793 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, తాగునీటి అవసరాల కోసం 231, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌లో బుధవారం సాయంత్రానికి 1078.30(40.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

లక్ష్మి గేట్లు లేచేనా..?



లక్ష్మి కాలువ గేట్లు

లక్ష్మి కాలువ ఆయకట్టుకు గురువారం ఉదయం నీటి విడుదల చేపట్టనున్న నేపథ్యంలో కాలువ హెడ్‌రెగ్యులేటర్ గేట్లు లేచేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హెడ్‌రెగ్యులేటర్ వద్ద గేట్లను గతంలో మాన్యువల్‌గా ఎత్తేవారు. లక్ష్మి కాలువ ఆధునికీకరణలో భాగంగా హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎలక్ట్రానిక్ వ్యవస్థలోకి తీసుకువచ్చారు. అందులో భాగంగా ఎస్సారెస్పీ దిగువన నిర్మించిన సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా కోసం కేబుల్ వేశారు. కాగా, గతేడాది నుంచి విద్యుత్ సరఫరా కావడం లేదు. గత యాసంగి సీజన్‌లోనే గేట్లు ఎత్తడానికి నానా తంటాలు పడ్డారు. ప్రస్తుతం గేట్లు ఎత్తాలంటే మాన్యువల్ ఆపరేటింగ్ చేయాలి. అయినా కూడా గేట్లు లేస్తాయా? లేదా? అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రెండు నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి ఆయిల్, కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి సబ్‌స్టేషన్‌లో సైతం విద్యుత్ లేదు. కాగా, అధికారులు ఓఅండ్ఎం నిధులతో మరమ్మతులు చేపడతామని చెప్పి అది కూడా మరచిపోవడం గమనార్హం.

దిగువనే విద్యుత్ సబ్‌స్టేషన్..

లక్ష్మికాలువ హెడ్‌రెగ్యులేటర్‌కు ఎదురుగా సుమారు 100 మీటర్ల దూరంలోనే ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. అక్కడి నుంచి విద్యుత్ సరఫరాకు కనెక్షన్ తీసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కేబుల్ ఖర్చు కూడా తక్కువగా అయ్యే అవకాశం ఉండడంతో అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి

లక్ష్మి కాలువపై ఉన్న లిఫ్టులకు ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసింది. వాటికి టెండర్లు పూర్తయ్యాయి. అందులో నుంచి నూతన విద్యుత్ కనెక్షన్ కోసం ప్రతిపాదనలు చేస్తున్నాం. త్వరలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం. – సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

ఢిల్లీలో ఇందూరు కాంగ్రెస్ నేతలు



పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి సురేఖతో జిల్లా కాంగ్రెస్ నాయకులు

- బీసీ రిజర్వేషన్ల సాధన పోరుకు తరలివెళ్లిన శ్రేణులు
- ఇటీవల జిల్లాలో జనహిత పాదయాత్ర సక్సెస్‌తో మరింత జోష్
- పీసీసీ అధ్యక్షుడు జిల్లా నుంచే ఉండడంతో ఢిల్లీ పోరుకు భారీ స్పందన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనకు నిజామాబాద్ జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ రిజర్వేషన్ల విషయమై కేంద్ర ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు పార్టీ తలపెట్టిన ఈ పోరుకు జిల్లా నుంచి మంచి స్పందన వచ్చింది. ఢిల్లీలో తమ గళాన్ని బలంగా వినిపించారు. పీసీసీ అధ్యక్షుడు నిజామాబాద్ జిల్లా నుంచే ఉండడంతో జిల్లా నాయకులు పార్టీ పోరుబాట కార్యక్రమంలో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో మంచి జోష్ వచ్చింది. ఈ పోరుబాటతో రానున్న స్థానిక ఎన్నికల్లో తమకు తిరుగులేని విధంగా కలిసి వస్తుందని పార్టీ శ్రేణులు అంచనాలు వేసుకుంటున్నాయి. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ నెల 2, 3 తేదీల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో నిర్వహించిన జనహిత పాదయాత్ర కార్యక్రమం, శ్రమదానం కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. అదేవిధంగా పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాల బాధ్యులు, అన్ని మండలాల బాధ్యులతో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ స్థాయిలో విజయాలు సాధిస్తామని ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

జంతర్‌మంతర్‌కు జిల్లా నాయకులు..

బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. నేడు రాష్ట్రపతికి వినతిపత్రం అందజేయనున్నారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళనలో జిల్లా నుంచి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఆకుల లలిత, మునిపల్లి సాయిరెడ్డి, దయాకర్ గౌడ్, బాస వేణుగోపాల్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్, సకినాల శివప్రసాద్, నరాల రత్నాకర్, సుమన్, గన్‌రాజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న జిల్లా కార్యకర్తలు

పథకాలపై పాజిటివ్ టాక్..

సన్నబియ్యం పంపిణీ పథకం నేపథ్యంలో ప్రభుత్వంపై సానుకూల స్పందన వస్తోంది. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలోనూ ప్రభుత్వం పకడ్బందీగా ముందుకు వెళ్తోంది. ఇక భూభారతి ద్వారా భూ సమస్యలను పరిష్కరించే విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించనున్నట్లు పార్టీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. రైతుభరోసా, సన్నధాన్యం, రైతులకు ఇవ్వనున్న బోనస్ సైతం తమకు కలిసివస్తాయని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. దీంతో తమకు స్థానిక ఎన్నికల్లో ఎలాంటి ఢోకా లేదనే ఆశాభావంతో ఉన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన మల్లయ్య

గాంధారి: అటవీ భూమిలో సాగు చేసిన పంటను ధ్వంసం చేయడానికి అధికారులు గడ్డిమందు పిచికారి చేయగా.. ఆ భూమిని సాగు చేసిన రైతు ఆవేదనతో ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు, ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతాయిపల్లి శివారులోని గండిమైసమ్మ కుంట అటవీ ప్రాంతంలో ఇరవై ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంటలు పండిస్తున్నాడు. అతడికి అప్పులు ఉండడంతో ఆ భూమిని కుర్మ సంఘానికి అప్పగించి, ఊరు విడిచి వలసవెళ్లాడు. అదే సామాజికవర్గానికి చెందిన కోరె పెద్దమల్లయ్య, చిన్నమల్లయ్య ఆ భూమిని కౌలుకు తీసుకుని వరి వేశారు. బుధవారం అధికారులు ఆ పంటపై గడ్డిమందు పిచికారి చేయించారు. అనంతరం ఫిర్యాదు చేయడంకోసం అటవీ అధికారులు, రైతులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో చిన్నమల్లయ్య వరిపై పిచికారి చేసిన గడ్డి మందును వెంట తీసుకుని వెళ్లి స్టేషన్‌లో తాగాడు. దీనిని గమనించిన గ్రామస్తులు వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కామారెడ్డికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కాగా అటవీ భూమిని ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నారని, వారించబోగా తమపై దాడికి ప్రయత్నించారని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ అరుణ.. కోరె మల్లయ్యతోపాటు మరికొందరిపై ఫిర్యాదు చేశారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తమ పంటలను కావాలని నాశనం చేశారని అటవీ అధికారులపై సీతాయిపల్లి రైతులు ఫిర్యాదు చేశారన్నారు.

నిధులు లేక నిలిచిన నియామకాలు

- విలీన ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది నియామకాలకు గతంలో ప్రతిపాదనలు
- ముందుకు సాగని ప్రక్రియ
- మెరుగైన సేవలందక ఇబ్బందులు పడుతున్న రోగులు



మోర్తాడ్(బాల్కొండ): వైద్య విధాన పరిషత్‌లో విలీనమైన సామాజిక ఆస్పత్రులలో వైద్య నిపుణులు, ఇతర వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ నిధుల కేటాయింపు లేక పెండింగ్‌లో పడింది. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోనే కొనసాగిన సామాజిక ఆస్పత్రులను గత ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లోకి విలీనం చేసింది. అనంతరం ప్రత్యేక నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మోర్తాడ్, ధర్పల్లి, డిచ్‌పల్లి, బాల్కొండ, నవీపేట్, వర్నిలలోని 30 పడకల ఆస్పత్రులు, ఆర్మూర్‌లోని వంద పడకల ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేశారు. భీమ్‌గల్ ఆస్పత్రి నిర్మాణంలో ఉన్నందున ఇక్కడ పోస్టుల భర్తీకి ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 30 పడకల ఆస్పత్రులలో 14 మంది చొప్పున వివిధ రకాల నైపుణ్యం గల వైద్యులు, 18 మంది చొప్పున వైద్య సిబ్బంది, వంద పడకల ఆస్పత్రిలో 48 మంది లెక్కన వైద్యులు, 73 మంది చొప్పున వైద్య సిబ్బంది నియామకాలను చేపట్టాలని నిర్ధారించారు. జిల్లాలో అన్ని ఆస్పత్రులలో వైద్యులు, వైద్య సిబ్బంది కలిపి 313 పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని ప్రతిపాదించారు. నిధులు లేకుండా నియామకాలు చేపడితే వేతనాల చెల్లింపు ఎలా అనే సందేహంతో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీని చేపట్టలేకపోయారు. వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసిన తరువాత పోస్టులను భర్తీ చేయకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వైద్యులు, ఉద్యోగులతోనే వైద్య సేవలను నెట్టుకొస్తున్నారు. ఫలితంగా మెరుగైన వైద్య సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. వైద్య విధాన పరిషత్‌కు నిధులను కేటాయిస్తే పోస్టుల భర్తీకి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై దృష్టి సారించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే నియామకాలు

త్వరలోనే వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో నియామకాలు జరిగే అవకాశం ఉంది. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని, వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న కొంత మంది ఉద్యోగులతో వైద్య సేవలను అందిస్తున్నాం. రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – డాక్టర్ శ్రీనివాస్‌రావు, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి భేష్

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ కితాబు
- ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన



సమీక్షలో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ గౌతమ్, పక్కన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఘన్‌పూర్‌లో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎండీ గౌతమ్, అదనపు కలెక్టర్ అంకిత్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి భేషుగ్గా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సెక్రటరీ, మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ జిల్లా యంత్రాంగం పనితీరును ప్రశంసించారు. ప్రత్యేకించి గడిచిన రెండు నెలల నుంచి ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా గణనీయమైన వృద్ధి సాధించిందని, రెండో విడత ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్‌లో ఆశించిన స్థాయి కంటే ఎక్కువ పురోగతి సాధించారని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డితోపాటు సంబంధిత శాఖల అధికారులను అభినందించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ బుధవారం జిల్లాలోని ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి, డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఒత్తిళ్లకు తలొగ్గొద్దు..

అర్హులైన వారి పేర్లు ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా నుంచి రద్దు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకుండా నిశితంగా పరిశీలించాలని, ఈ విషయంలో ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గకూడదని స్పష్టం చేశారు. హౌసింగ్ అధికారులు తహసీల్దార్, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని ఉచితంగా ఇసుక టోకెన్లు అందించాలని సూచించారు. కంకర, ఐరన్, సిమెంటు, ఇటుకలు ఇతర సామగ్రి నిర్ణీత ధరలకే అందించేలా మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ చర్యలు తీసు కోవాలన్నారు. మేస్త్రీలు నిర్ధారిత రుసుము మాత్రమే తీసుకునేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో తలెత్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఆధార్ నంబర్‌కు లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాలోకి బిల్లు మొత్తం జమ అవుతుందని, వారం రోజుల్లో ఈ ప్రక్రియ అమల్లోకి రానుందని ఎండీ గౌతమ్ వెల్లడించారు. లబ్ధిదారుల వివరాలను ప్రధానమంత్రి ఆవాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన వారికి కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని అభయ హస్తం కాలనీలో 4.32 ఎకరాల ప్రభుత్వ స్థలంలో జీ+3 విధానంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని యంత్రాంగానికి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, హౌసింగ్ పీడీ పవన్ తదితరులు పాల్గొన్నారు.

17,291 ఇళ్లు మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఎండీ గౌతమ్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల క్షేత్రస్థాయి పరిస్థితిని మండలాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎండీకి వివరించారు. జిల్లా వ్యాప్తంగా 19,306 ఇళ్లను కేటాయించాలని లక్ష్యం కాగా, 17,291 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. వాటిలో 9,360 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, 5,541 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.లక్ష వరకు రుణం అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 2,637 మందికి రూ. 30.07 కోట్ల రుణాలు ఇప్పించామని వెల్లడించారు. ఇంటి నిర్మాణానికి సుముఖంగా లేని వారి నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకుని, వారి స్థానంలో అర్హులైన వారికి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

క్లుప్తంగా

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



ఖలీల్‌వాడి: తెలంగాణ తొలి, మలి దశల ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనకు జయశంకర్ సార్ మార్గదర్శకులయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ బంగారు తెలంగాణ కోసం శ్రమించాలని, భవిష్యత్ తరాల కోసం బంగారు బాట వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఆసియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్, వనజ, రిజర్వ్ సీఐ శ్రీనివాస్, తిరుపతి, సీఐలు రమేశ్, వీరయ్య, సతీశ్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: రాఖీ పౌర్ణమి పండుగకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి నిజామాబాద్ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి ఈనెల 7, 8, 9 లలో నిజామాబాద్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి తోపాటు బోధన్ వైపునకు అదనపు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్యూల్ బస్సులతో పాటు 149 అదనపు బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచామన్నారు. ఆర్మూరుకు 20, బోధన్‌కు 31, నిజామాబాద్‌కు 35, బాన్సువాడకు 19, కామారెడ్డికి 44 ప్రత్యేక బస్సులను సికింద్రాబాద్‌కు నడుపనున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రికి నోటీసు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి జిల్లా వైద్యాధికారులు నోటీసులు ఇచ్చారు. వారం రోజుల క్రితం బిచ్కుంద మండలానికి చెందిన ఓ బాలుడికి జ్వరం రావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు బాలుడిని నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో బాన్సువాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందినట్లు బాలుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి బాధ్యత రహితంగా వ్యవహరించినట్లు నిర్ధారించి ఆస్పత్రికి నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో ఆస్పత్రిని మూసివేయాలని సూచించినట్లు తెలిసింది.

పగిలిన పైప్‌లైన్



బాల్కొండ: ఎస్సారెస్పీ వద్ద కాకతీయ కాలువ వంతెనపై కాలనీకి నీటి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరు లీకేజై వంతెనపై కుంటలా నిలిచింది. గురువారం ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా ప్రజాప్రతినిధులు నీటి విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో పైపులైన్ నుంచి నీరు రాకుండా ఉండేందుకు సిబ్బంది ప్లాస్టిక్ కాగితం టేపును చుట్టారు. ఇనుప పైపుకు చిన్న వెల్డింగ్ మరమ్మతులు చేపడితే సమస్య పరిష్కారమయ్యేది. కానీ అలా కాకుండా కాగితం టేపును చుడుతుండటంపై కాలనీవాసులు ఇదేమి చోద్యం అంటు ముక్కున వేలేసుకుంటున్నారు.

దాడి చేసి సెల్‌ఫోన్ల చోరీ

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులోని వేంపల్లి ఎత్తిపోతల పథకంలో పని చేస్తున్న దండుగుల గంగాధర్, దండుగుల వెంకటేశ్వర్లు పై మంగళవారం అర్ధరాత్రి గురు తెలియన వ్యక్తులు దాడి చేసి వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ పేర్కొన్నారు.

అంతర పంటలు.. ఆదాయ వనరులు

- ఆయిల్ పామ్ చెట్ల మధ్య పసుపు పంటతో అదనపు ఆదాయం
- పసుపులో అంతర పంటగా మొక్కజొన్న విత్తుకుంటున్న రైతులు



అంకాపూర్‌లో ఆయిల్ పామ్ చెట్ల మధ్య అంతర పంటగా పసుపును విత్తుకున్న రైతు

ఆర్మూర్: జిల్లాలో సంప్రదాయ వ్యవసాయానికి పెద్ద పీట వేసే రైతులు ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు వేస్తూ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురువడంతో పాటు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు గ్రామాల్లోని చెరువుల్లోకి చేరుతుండటంతో రైతులు ఈ ఏడు తమ పంటలు పండినట్లేనని ఆనందంగా ఉన్నారు. ప్రధాన పంటలతో పాటు చిన్న చిన్న ఖర్చులు వెల్లదీసుకోవడానికి ప్రతీ రైతు అంతర పంటలను విత్తుకుంటున్నారు.

జిల్లాలో వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం సుమారు 32 వేల ఎకరాల్లో పసుపు పంటను పండిస్తున్నారు. పసుపును జూన్ మొదటి వారం నుంచి విత్తుకుంటు ఉంటారు. తొమ్మిది మాసాల పంట అయిన పసుపు జనవరి, ఫిబ్రవరి నెలలో రైతుల చేతికి అందుతుంది. అయితే పసుపు మొలక దశలో నీడ అవసరం ఉంటుంది. లేకుంటే పసుపు మొలక ఎండలకు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు పసుపు పండించే మళ్లలో అంతర పంటగా పసుపుతో పాటు మొక్కజొన్నను విత్తుకుంటారు. పల్చగా విత్తుకున్న మొక్కజొన్న పసుపు మొలకకు నీడగా ఉండటమే కాకుండా రైతులకు అదనపు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుంది. ఒకే మడిలో ఏకకాలంలో రెండు పంటలు విత్తుకొనే అవకాశం ఏర్పడుతుంది. మరో వైపు ఆయిల్ పామ్ మొక్కల మధ్య పసుపు పంటను విత్తుకుంటుంటారు. పసుపు విత్తుకున్న మళ్ల ఒడ్లపై కందులు (తొగర్లు), చిక్కుడు, దోసకాయలు, బంతి పూలను సైతం రైతులు విత్తుకుంటారు. ఈ పంటలు రైతులకు చిన్న చిన్న ఖర్చులు వెల్లదీసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటాయి. పసుపు సాగుకు ఉపయోగించే నీటితోనే అదనంగా మొక్కజొన్న, చిక్కుడు, కందులు, దోసకాయ, బంతిపూల లాంటి పంటలు ఎలాంటి శ్రమ లేకుండా పెరిగిపోయి పంట చేతికి వస్తుంది. దీంతో పసుపు పంటకు పెట్టుబడి వ్యయం అధికంగా అవుతున్న రైతులకు ఆర్థిక భారం కొంతైనా తగ్గే అవకాశం ఉంటుంది.





పసుపులో అంతర పంటగా సాగువుతున్న కంది, మక్క, చిక్కుడు పంట

పాలకు నీళ్లలా..



పాలకు నీళ్లలా అంతర పంటలు రైతుకు ఆర్థికంగా ఎంతో కొంత ఉపయోగకరంగా ఉంటాయి. ఒడ్లపై వేసిన కందులు, దోసకాయ సైతం మార్కెట్‌లో అమ్మడం ద్వారా రైతులు లాభపడే అవకాశం ఉంది.

– సత్యంరెడ్డి, రైతు, ఫతేపూర్

మొక్కజొన్న విత్తుతాం



పసుపు పంట మొలక దశలో ఎండిపోకుండా నీడలో పెరగడం కోసం అంతర పంటగా మొక్కజొన్నను విత్తుకుంటాం. మూడు నెలల్లో మొక్కజొన్న పంట చేతికి వస్తుంది.అంతర పంటలతో పసుపునకు ఉపయోగకరంగా ఉంటుంది.

– చిన్నారెడ్డి, రైతు, పిప్రి

అదనపు ఆదాయం..



పసుపు పంటలో అంతర పంటగా విత్తుకున్న మొక్కజొన్న, కందులు, దోసకాయ, బంతి పూల లాంటివి మార్కెట్‌లో అమ్మడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోంది. ఈ అంతర పంటల కోసం పెట్టుబడి చేయాల్సిన అవసరం లేదు.

– నచ్చు గంగారెడ్డి, రైతు, పెర్కిట్

వేల్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



తహసీల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్

వేల్పూర్: మండల కేంద్రంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీ, సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను పరిశీలించారు. పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. సాంకేతిక ఇబ్బంది కారణంగా కొంతమంది విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు కావడం లేదని హెచ్‌ఎం రాజన్న తెలుపగా, కలెక్టర్ అప్పటికప్పుడు ఎఫ్‌ఆర్‌ఎస్ పద్ధతిన విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. అంతకుముందు వేల్పూర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు స్థానికంగానే సుఖ ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ వీణకు సూచించారు. కాగా, పీహెచ్‌సీల్లో బేబీ వార్మర్లు పని చేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్ టీజీఎంఎస్ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కు ఫోన్ చేసి, వెంటనే అన్ని పీహెచ్‌సీల్లో బేబీ వార్మర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్తవి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎరువుల గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో బాలకిషన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి గురించి జీపీ కార్యదర్శి వినోద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఉన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి
- జిల్లా వైద్యాధికారి రాజశ్రీ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో నులి పురుగుల నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బీ రాజశ్రీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ, శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న జిల్లా వ్యాప్తంగా 1–19 సంవత్సరాల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయంచాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు మాత్రలను అందజేస్తామన్నారు. అల్బెండజోల్ మాత్రలపై అపోహలు అవసరం లేదని, మాత్రలు తీసుకోవడం పిల్లల ఆరోగ్యానికి మంచిదన్నారు. నులి పురుగులను నిర్మూలించి పోషకాహార లోపాలని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, విద్యాశాఖ అకడమిక్ మానిటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవో సౌందర్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ సచిన్, వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం దీర్ఘకాలిక ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ ప్రత్యేకాధికారి ఒడ్డెన్న

నిజామాబాద్‌అర్బన్: విద్యా బోధనలో ఉత్తమ ఫలితాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర ఇంటర్ విద్య బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి ఒడ్డెన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యా కార్యాలయంలో డీఐఈవో రవికుమార్ అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా బోధనపై ప్రిన్సిపాళ్లు ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించి దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించి అధ్యాపకులతో అమలు చేయించాలన్నారు. అపార్ గుర్తింపు లేని విద్యార్థులను గుర్తించి వెంటనే అపార్ నంబర్ గుర్తింపుతో పాటు యుడైస్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు సమయపాలన పాటించడంలో ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై అధ్యాపకులు శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాముకాటుతో యువకుడి మృతి



మృతుడు రాజు

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన వరగంతం రాజు (25) అనే యువకుడు పాము కాటుతో మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ మండల అశోక్ తెలిపారు. దినసరి కూలి అయిన రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రెంజల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెంజల్ మండలం దూపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాతరాజు చిన్న గంగామణి(57) అనే వృద్ధురాలు ఇంట్లో ఒక్కరే ఉంటున్నారు. ఆమె ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె దేవ గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని షేక్ చాంద్ హోటల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న రాజారాందుబ్బాకు చెందిన దాసరి పోశెట్టిని అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు నిజామాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ బాబాఖాన్ వద్ద కొనుగోలు చేసి బాన్సువాడలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పోశెట్టి నుంచి 275 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పోశెట్టిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్ మండలం హంగర్గా శివారులోని వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నీలా శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిర్‌పూర్‌లో..

మద్నూర్: డోంగ్లి మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతులు తరలిస్తున్నట్లు రుజువు కావడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్‌ను తహసీల్ కార్యాలయానికి తరలించామన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఐ హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో నంబర్ బస్ డిపో వెనక ప్రాంతంలో గురుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. డిపో పక్కన దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. సుమారు ఆరు రోజుల క్రితం మరణించడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. మృతి చెందిన మహిళ కామారెడ్డి ప్రాంతానికి చెందినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించామని, మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

ఢిల్లీ మహాధర్నాలో కాంగ్రెస్ నేతలు





ఢిల్లీ మహాధర్నాలో పాల్గొన్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, రూరల్‌ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం నిర్వహించిన మహాధర్నాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హాజరయ్యారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదం తెలపాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. అదే విధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఢిల్లీలో నిర్వహించిన మహాధర్నాకు హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి

- డీఎఫ్‌వో కార్యాలయ ముట్టడికి ఏఐబీఎస్‌ఎస్ యత్నం
- మోపాల్‌లో బైరాపూర్ గ్రామస్తుల ముందస్తు అరెస్ట్



ఫారెస్టు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బైరాపూర్ గిరిజనులు

మోపాల్: అటవీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని బైరాపూర్‌కు చెందిన ప్రకాశ్, కవిత, జలంధర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని ఏఐబీఎస్‌ఎస్ ప్రతినిధులు మూడ్ బాబూరావు, రమావత్ మోహన్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి బానోత్ నరేశ్ నాయక్ డిమాండ్‌చేశారు. కేసులు ఎత్తేయాలని, అటవీ భూమి సాగుకు అనుమతివ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐబీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నగరంలోని వర్నిరోడ్‌లోగల డీఎఫ్‌వో కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఏఐబీఎస్‌ఎస్ నాయకులు డీఎఫ్‌వో కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం గేట్లు మూసేయడంతో అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తేయాలని నినాదాలు చేశారు. పోలీసులు, ఫారెస్ట్ అధికారులు సముదాయించారు. అనంతరం ఎఫ్‌ఆర్‌వో రాధికకు మోహన్ నాయక్, నరేష్ నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, కొర్ర గంగాధర్, పీర్‌సింగ్, బాలు నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, సురేశ్ నాయక్, డాన్ శ్రీను, ఇందల్ నాయక్, నరేందర్, గోపాల్, శంకర్, సంగ్యానాయక్, పరుశరామ్, తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్ గ్రామస్తుల ముందస్తు అరెస్ట్

డీఎఫ్‌వో కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడికి వెళ్లకుండా ముఖ్య నాయకులు, గ్రామస్తులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 3 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. సీఐ సురేశ్‌కుమార్ సూచనల మేరకు కొందరు నాయకులు మాత్రమే డీఎఫ్‌వో కార్యాలయానికి వెళ్లి ఎఫ్‌ఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. అనంతరం వారిని సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

బీకేఎస్ కృషితో రైతుకు న్యాయం

- లారీ కాంట్రాక్టర్‌తో రూ.60వేలు ఇప్పించిన నాయకులు



పోతన్నకు చెక్కు అందిస్తున్న నాయకులు

మోపాల్: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో చేసిన పోరాటం, వినతులకు కలెక్టర్, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి రైతుకు న్యాయం చేశారు. లారీ కాంట్రాక్టర్ ద్వారా ఇప్పించిన రూ.60వేల చెక్కును బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవుడిగారి సాయిరెడ్డి రైతు బక్క పోతన్నకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బక్క పోతన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. మే 18న 400 బస్తాల ధాన్యాన్ని మోపాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించారన్నారు. కానీ ట్రక్ షీట్‌లో కేవలం 310 బస్తాలు మాత్రమే అందినట్లు రైస్‌మిల్లు ద్వారా చూయించి ఈ బస్తాలకు మాత్రమే రూ.2,27,680 నగదు బ్యాంకు అకౌంట్‌లో జమచేశారని పేర్కొన్నారు. ఇదే విషయమై సొసైటీ సిబ్బందిని ప్రశ్నించినా.. నిలదీసినా.. స్పందించలేదని రైతు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న బీకేఎస్ కార్యకర్త గంగారెడ్డి రైతు బాధను విని, భారతీయ కిసాన్ సంఘ్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారన్నారు. అన్ని రుజువులతో రైతు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి విన్నవించగా, ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతుకు న్యాయం చేయాలని ఆదేశించారని తెలిపారు. ఆ తర్వాత పోతన్న బీకేఎస్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్, పౌరసరఫరాలశాఖ అధికారులను కలువగా, తప్పిదానికి కారణమైన ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ నుంచి రూ.60వేలను రైతుకు ఇప్పించామని పేర్కొన్నారు. రెండు నెలలపాటు భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు దేవుడిగారి సాయిరెడ్డి, గంగారెడ్డి, జనగాం భూమయ్య, దశరథ్‌రెడ్డి తదితరులు కృషికిగాను రైతుకు న్యాయం జరిగిందని తెలిపారు. బీకేఎస్ పోరాటానికి రైతు బక్క పోతన్న ధన్యవాదాలు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు



కేసు వివరాలు తెలుపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో గంజాయి తరలిస్తున్న నలుగురి నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో ఓ కారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో నలుగురు నిందితులు పట్టుబడగా వారు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ మునావర్, మహమ్మద్ ఇర్ఫాన్, అమీర్ పాషా, నిజామాబాద్‌లోని ముజాయిత్‌నగర్‌కు చెందిన అన్వర్‌గా పోలీసులు గుర్తించారు. కారులో రెండు కిలోల వంద గ్రాముల ఎండు గంజాయి లభించిందని అన్నారు. నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో ఎస్సైలు రామ్‌కుమార్, చారి, సిబ్బంది హమీద్, శివ, రాజన్న, భోజన్న, ఆశన్న, రాంబచన్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బైద్యాపూర్‌కు చెందిన డేకల్ మోతె అనే వ్యక్తి డెకరేషన్ పనులు చేస్తూ, యూపీకి చెందిన రవీంద్ర చౌహాన్ పెయింటర్‌గా పని చేస్తూ కొంతకాలంగా కామారెడ్డిలో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం చేపట్టిన వాహనాల తనిఖీల్లో వీరిని పట్టణ పోలీసులు డ్రంకన్ డ్రై వ్‌లో పట్టుకున్నారు. బుధవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ వీరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 ల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజూ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 18 మంది పట్టుబడగా వీరిని పీఎస్‌కు తరలించి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. జడ్జి 16మందికి రూ. 25,500 జరిమానా విధించగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో సిర్‌పూర్ గ్రామానికి చెందిన బొద్దు గంగాధర్‌కు ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై పేర్కొన్నారు.

డయల్–100 దుర్వినియోగంలో ఇద్దరికి..

ధర్పల్లి: మండలంలోని డీబీ తండాకు చెందిన రూప్లా నాయక్, గణేశ్ మద్యం సేవించి ఈనెల 4న డయల్–100కు పలుమార్లు ఫోన్ చేసి పోలీసుల విధులను దుర్వినియోగ పరిచారు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి బుధవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా వీరికి జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే డయల్–100ను ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.